నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 24 మార్చి 2025 | SIDDIPET

కాంగ్రెస్ పాలన రైతులకు శాపం

- ప్రభుత్వ అసమర్థతతోనే పంటలు ఎండుతున్నాయి..
- వడగండ వానకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి
- వడ్లు రాలితేనే పరిహారానికి పంపుతామని అధికారులు అనడం సమంజసం కాదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటల పరిశీలన

బోనస్ బోగస్ అయ్యింది.. రైతుభరోసా, రుణమాఫీ అమలులో ప్రభుత్వం మోసం చేసింది

సిద్దిపేట/నారాయణరావుపేట, మార్చి 23: వడగండ్ల వానతో చాలా గ్రామాల్లో పంట నష్టం జరిగిందని, ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులను గుర్తించి ఇన్‌పుట్ సబ్సిడీ కింద సహాయం చేసి ఆదుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన రైతు ఎల్కపల్లి నర్సింలు వరి పంటను, రైతు రామస్వామి బొప్పాయి తోటను ఆదివారం హరీశ్‌రావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా దగా చేస్తున్నదని విమర్శించారు. వరంగల్ డిక్లరేషన్‌లో చాలా మాటలు చెప్పి అమలు చేయడం లేదన్నారు. రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీఇచ్చి సంపూర్ణంగా చేయలేదన్నారు. రూ.2లక్షలకు పైన రుణం ఉన్న రైతులతో పైన డబ్బులు చెల్లించి రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఊరికి పోయి చూసినా సగం మంది రుణమాఫీ కాని రైతులు కనిపిస్తున్నారని, రైతులను ప్రభుత్వం మోసం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రైతుబంధు రూపంలో కేసీఆర్ రైతులకు నేరుగా సహాయం చేశాడని, 11 విడతల్లో రూ.73 వేల కోట్లు రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఎకరాకు రూ.7500 చొప్పున వానకాలం, యాసంగి పంటలకు సంబంధించి రూ. 15 వేల చొప్పున వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు బోనస్ క్వింటాలుకు రూ.500 ఇస్తామని చెప్పి బోగస్ చేశారని విమర్శించారు. పంటల బీమా అని చెప్పి రూ.1300 కోట్లు బడ్జెట్‌లో పెట్టారని, కానీ.. రైతులకు మూడు పంటలకు బీమా రాలేదన్నారు. రైతులకు రూపాయి సహాయం ప్రభుత్వం అందించలేదని విమర్శించారు. బీమా ఉండి ఉంటే రైతులకు ఇంత నష్టం జరిగేది కాదన్నారు.ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేలు ఇచ్చామని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పారని, సిద్దిపేట జిల్లాలో పోయిన ఏప్రిల్‌లో వడగండ్ల వానలు, పోయిన ఏడాది మేలో వడగండ్లు పడి నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కాంగ్రెస్ ప్రభుత్వం సహాయం చేయలేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. రుణమాఫీపై అసెంబ్లీ సాక్షిగా మంత్రులు అబద్ధాలు ఆడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట బట్టే బాజ్ పార్టీ అని హరీశ్‌రావు విమర్శించారు.

లక్ష్మీదేవిపల్లిలో వడగండ్ల వానతో దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

లక్ష్మీదేవిపల్లిలో వడగండ్ల వానతో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కాంగ్రెస్ తెచ్చిన కరువు ఇది..

1.50 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, దీనికారణం కాంగ్రెస్ వైఫల్యం అని ధ్వజమెత్తారు. దేవాదుల మోటర్లు 35 రోజులు చాలు చేయకపోవడంతో వరంగల్ జిల్లాలో రూ. 600కోట్ల విలువైన పంటలు ఎండిపోయినట్లు తెలిపారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో ఎండలు కొట్టలేదా అని ప్రశ్నించారు. నాడు కేసీఆర్ మండుటెండల్లో చెరువులు, చెక్‌డ్యామ్‌లు, వాగులు, కాలువల్లో నీళ్ల పారించారని, రైతులకు నీళ్ల ఇచ్చి పంటలు రక్షించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరద వచ్చినప్పుడు దిక్కులు చూసి నీళ్లను కిందికి వదిలి ఇప్పుడు రైతుల ఉసురు పోసుకుంటున్నట్లు విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొవాలని హితవు పలికారు. వరంగల్ డిక్లరేషన్ చెప్పిన హామీలు ఇక్కటి నెరవేర్చలేదన్నారు. సిద్దిపేట,మెదక్ జిల్లాల్లో వడగండ్ల వాన తీవ్రతతో ఎక్కువగా పంటనష్టం జరిగిందని, ప్రభుత్వం వెంటనే సర్వేచేయించి బాధిత రైతులను ఆదుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వడ్లు రాలిపోయినవే పంట నష్టం కింద రాస్తామని అధికారులు అంటున్నారని, పొట్ట దశకు వచ్చిన వరిపై వడగండ్లు పడడంతో గింజ పెట్టక తాలు వస్తుందని, అలాంటి వాటికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద సహాయం అందించేలా అధికారులు చొరవ చూపాలని హరీశ్‌రావు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ బొంగురం మంజులాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాల కృష్ణ, మాజీ ఎంపీటీసీ దండు సప్న ప్రభాకర్, నాయకులు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, పరశురాములు, నారాయణ, శంకర్, బాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతులకు నష్టం

మిరుదొడ్డిలో నేలకొరిగిన మొగుళ్ల కనకయ్య చేనులోని మొక్కజొన్న పంట

మిరుదొడ్డి, మార్చి 23: సిద్దిపేట జిల్లా ఉమ్మడి మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతన్నలకు నష్టం జరిగింది. ఉరుముల మెరుపులతో కురిసిన గాలివానతో పాటు రాళ్లు పడ్డాయి. దీంతో పొట్ట దశకు వచ్చిన వరి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందిన మొక్కజొన్న పంటలు గాలివానకు నెలకొరిగాయి.

కష్టపడితేనే బంగారు భవిష్యత్

సిద్దిపేట జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- మహిళలు గడపదాటి తమ శక్తి సామర్థ్యాలను చూపించాలి
- నేటి మహిళలు ఆర్థిక స్వతంత్రం కోరుకుంటున్నారు..
- ఫాక్స్‌కాన్ ప్రపంచంలోనే ఉత్తమమైన కంపెనీ
- ఉద్యోగాల భర్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సిద్దిపేట మహిళా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, మార్చి 23: జీవితం మొదడి అడుగుతోనే ప్రారంభమవుతుందని, ఉద్యోగం చిన్నదా, పెద్దదా అనే అనుమానాలు వద్దని, కష్టపడితే విజయం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో మహిళల కోసం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇంట్లో నుంచి అడుగు బయటకు పెట్టి కష్టపడిన వారు జీవితంలో తప్పకుండా విజయం సాధిస్తారన్నారు. ఇంట్లో ఉంటే పోటీ ప్రపంచాన్ని అర్థం చేసుకోలేమని, బయటకు వచ్చినప్పుడే ఎదగాలి, పైకి రావాలనే పట్టుదల పెరుగుతుందన్నారు. ఫాక్స్‌కాన్ కంపెనీ దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఉత్తమ కంపెనీ అన్నారు. అక్కడ పనిచేసే వారందరూ మహిళలే కాబట్టి రక్షణతో ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. పనిచేసుకుంటూ కూడా చదువుకోవచ్చని, పోటీ పరీక్షలు రాసుకోవచ్చన్నారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఉద్యోగం ఎలాంటిదైనా ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందన్నారు. 4వేల ఉద్యోగాలు ఉన్నాయని, చాలామంది పోటీ పడుతున్నారని.. కానీ, సిద్దిపేట యువతకు అవకాశం కల్పించాలని కంపెనీ ప్రతినిధులను కోరినట్లు తెలిపారు. గతంలో సిద్దిపేటలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ ఇస్తే 250 మంది కానిస్టేబుళ్లుగా, 33 మంది గ్రూప్స్‌లో ఉద్యోగం సాధించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. మహిళలు తమకు తాము తక్కువ అంచనా వేసుకోకూడదని, మహిళల్లో శక్తి, సామర్థ్యం ఉంటుందని, ఆ శక్తి సామర్థ్యాలను బయటకు తీయాలంటే బయటకు రావాలని, వచ్చి తమ కాళ్లపై తాము నిల్చోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిందపి, 15 నెలలు గడుస్తున్నా 7వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కానీ, 57 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్నదని ధ్వజమెత్తారు. అందులో 50 వేల ఉద్యోగాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో నోటిఫికేషన్ ఇచ్చి, ఎంపిక చేసిన వారికే నియామక పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 1,62,000 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి రూ.2 లక్షల పైన రుణమాఫీ చేసేది లేదని తేల్చి చెప్పారన్నారు. రుణమాఫీ లేదు, రైతు భరోసా లేదు, యువతకు ఉద్యోగాలు లేవు, మహిళలకు స్కూటీలు లేవు, తులం బంగారం లేదని ప్రభుత్వ తీరును హరీశ్‌రావు విమర్శించారు. ఎనుముల రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే ప్రజలకు ఎగవేతలు తప్ప ఏమీ మిగలలేదన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా స్థానిక యువతకు 95 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. కేసీఆర్ కృషితోనే రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


సిద్దిపేట జాబ్‌మేళాలో పాల్గొన్న యువతులు, మహిళలు

సర్వ జగత్‌రక్షకుడు ఆంజనేయస్వామి

వెంకటాపూర్‌లో ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, మార్చి 23: సర్వ జగత్ రక్షకుడు ఆంజనేయ స్వామి... ఆ దేవుడి కృపతో అందరూ బాగుండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని వెంకటాపూర్‌లో హనుమాన్ దేవాలయాన్ని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించుకొని ప్రతిష్ఠ చేసుకోవడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్వాహకులు, ప్రజలను అభినందించారు. హరీశ్‌రావును అర్చకులు ఆశీర్వదించగా నిర్వాహకులు సత్కరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెంట మండల నాయకులు తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్


చిన్నకోడూరులో టిఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

- పూర్తిస్థాయిలో పంట ఉత్పత్తులు ప్రభుత్వమే కొనాలి
- సన్‌ఫ్లవర్ రైతుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించా
- హుస్నాబాద్‌లో రైతులు ఇబ్బంది పడుతుంటే మంత్రి పొన్నంకు కనిపించడం లేదా..
- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

చిన్నకోడూరు, మార్చి 23: కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, మొక్కజొన్న, వరి తదితర రైతులు పండించిన పంటలన్నింటినీ కేంద్రంతో సంబంధం లేకుండారాష్ట్రం పూర్తిస్థాయిలో రైతుల నుంచి కొనుగోలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలకేంద్రంలో పలు కార్యక్రమాల్లో అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మద్దతు ధరకు రైతుల నుంచి పూర్తిస్థాయిలో పంట ఉత్పత్తులు కొన్నట్లు గుర్తుచేశారు. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం కందులు ఎకరానికి 6 క్వింటాళ్లు మాత్రమే కొంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎకరాకు కందులు 9 క్వింటాళ్ల వరకు పండితే 6 క్వింటాళ్లు సర్కారు కొంటే మిగతావి రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 11 వేల ఎకరాలు సన్‌ఫ్లవర్ పంట సాగైందని, కానీ.. 500 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతుల నుంచి కొనడానికి ప్రభుత్వం ఆదేశించడం సరికాదన్నారు. పండిన పంటంతా కొనడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఇంతవరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు నష్టపోతున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జొన్నలు, కందులు రైతుల నుంచి పూర్తిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుభరోసా, రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తున్నట్లు హరీశ్‌రావు విమర్శించారు. సన్‌ఫ్లవర్ రైతుల సమస్యలను అసెంబ్లీలో తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో సన్‌ఫ్లవర్ రైతులు ఇబ్బంది పడుతుంటే మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వేలేటి రాధాకృష్ణశర్మ, కామునీ శ్రీనివాస్, పాపయ్య, ఇట్టబోయిన శ్రీనివాస్, ఉమేశ్‌చంద్ర, జంగిటి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, వేణు, బాబు, రాజిరెడ్డి, లింగం, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేటలో ఇఫ్తారు విందులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

మైనార్టీలపై కాంగ్రెస్ చిన్నచూపు

- ప్రభుత్వపరంగా ఇఫ్తార్ విందు తొలిసారి ఏర్పాటు చేసిందే కేసీఆర్
- ఏటా పదిమందిని ఉమ్రాయాత్రకు పంపుతున్నా
- ఆఖరి సఫర్ వాహనం ఏర్పాటు చేశా..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు

సిద్దిపేట, మార్చి 23: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలపై చిన్నచూపు చూస్తున్నదని, బడ్జెట్‌లో వారికి కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చుచేయడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందు అనేది సిద్దిపేటలో మొదలైన నేడు దేశవ్యాప్తంగా కొనసాగుతోందని అన్నారు. ప్రభుత్వ పరంగా మొదటిసారిగా దావతే ఇఫ్తార్ ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని తెలిపారు. హైదరాబాద్ తర్వాత తొలి హజ్‌హౌస్ సిద్దిపేటలో నిర్మించుకున్నట్లు చెప్పారు. పేదల కోసమే ప్రభుత్వాలు పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల కోసం రూ. 3300 కోట్లు కేటాయించి రూ.1000 కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ హయాం నుంచి సిద్దిపేటలో గంగా జమునా తెహజీబ్ నడుస్తోందన్నారు. రంజాన్ పండుగకు ప్రభుత్వపరంగా రంజాన్ తోఫాతో పాటు ఇఫ్తార్ విందు ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇఫ్తార్ విందులను అధికారికంగా నిర్వహించకుండా ముస్లింలను విస్మరించిందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మైనార్టీ గురుకుల పాఠశాలలను ఇంటిగ్రేటెడ్‌లో కలపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మైనార్టీ గురుకుల పాఠశాలల్లో నమాజ్‌తో పాటు అరబ్బీ ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన చేస్తారన్నారు. ఈ పాఠశాలలు ఇంటిగ్రేటెడ్‌లో కలిపితే ముస్లిం విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఏటా పదిమంది నిరుపేద ముస్లింలను తన సొంత డబ్బులతో ఉమ్రాయాత్రకు పంపుతున్నట్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. సిద్దిపేట డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో సుమారు 700 నిరుపేద ముస్లింలకు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఇమామ్‌లకు ప్రభుత్వ నుంచి గౌరవ వేతనాలు ఇచ్చిందన్నారు. తనకు హిందువులు, ముస్లింలు రెండు కండ్లలాంటి వారని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోనే ఆఖరి సఫర్ వాహనం ప్రారంభించుకున్నామని, నేడు ఇది దేశానికి ఆదర్శంగా నిలిచి అమలవుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజ్‌రెడ్డి, అక్బర్ పటేల్, సుందర్, వజీర్, మోయిజ్, తిరుమల్‌రెడ్డి, శ్రీహరి, శ్రీకాంత్, నయ్యర్ పటేల్, ఇర్షాద్ హుస్సేన్, జావిద్, బాబు జానీ, వహీద్ అక్బర్, అజీజ్, ఆదాబ్ మోహిజ్, బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఫరూఖ్ హుస్సేన్

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

- ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలి
- తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- దేవన్నపేట పంపుహౌస్ సందర్శన


దేవన్నపేట పంపుహౌస్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 23: కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లకు గోదావరి జలాలు రాలేదని, వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారం అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-3లో భాగంగా నిర్మించిన దేవన్నపేట పంపుహౌస్ నుంచి మోటరు ప్రారంభించి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేర్యాల ప్రాంత బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దేవాదుల ప్రాజెక్టు ఫేజ్-3ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాదుల కథ రాస్తే రామాయణం, వింటే మహాభారం అంత ఉందని, తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి సీఎం చంద్రబాబు హెలికాప్టర్‌లో వచ్చి గోదావరి తీరనా శంకుస్థాపన చేసి వెళ్లిపోయాడన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదులను పట్టించుకోలేదని, కేవలం 40వేల ఎకరాలే నీరు ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం కేసీఆర్ దేవాదుల కోసం 5.14 లక్షల ఎకరాలకు నీరు అందేలా నిధులు కేటాయించారన్నారు. ఫేస్-1, ఫేస్- 2 పూర్తి చేసి ఫేస్-3లో భాగంగా రామప్ప దగ్గర దేవన్నపేట వరకు టన్నెల్ నిర్మాణం, దేవన్నపేట దగ్గర నుంచి ధర్మసాగర్ వరకు పంపులకు సంబంధించిన నిర్మాణ పనులను మొదలు పెట్టి రూ.1250 కోట్ల నిధులు కేటాయించినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని టన్నెల్ నిర్మాణం పూర్తిచేయించి, మోటర్లు తెప్పించి బిగించినట్లు తెలిపారు. కానీ, మోటర్లను ఆన్ చేయమంటే కాంగ్రెస్ సర్కారుకు అవగాహన లేదని, మోటర్లు ఎక్కడ ఉంటాయో కూడా తెలియదని, పంపులు ఎక్కడ ఉన్నాయో, టన్నెల్ గురించి అసలే అవగాహన లేదని ఎద్దేవా చేశారు. జనగామ నియోజకవర్గంలోని కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి, మద్దూరు మండలంలోని లద్నూర్‌తో పాటు బొమ్మకూరు, చీటకోడూరు, గండిరామారం రిజర్వాయర్లకు ధర్మసాగర్ నుంచి నీళ్లు రావాలన్నారు. ధర్మసాగర్‌కు చలివాగు నుంచి నీళ్లు రావాలని, చలివాగుకు బీంఘనపూర్ నుంచి రావాలని, బీంఘనపూర్‌కు గోదావరి తీరం నుంచి గోదావరి జలాలు వస్తాయన్నారు.ఆనాడు గోదావరిలో ఇంటెక్ పాయింట్ సరిగ్గా లేకపోవడంతో కేసీఆర్ ప్రభుత్వం సమ్మక్క బ్యారేజ్ నిర్మించినట్లు తెలిపారు. ఎండాకాలంలో నీటికి సమస్య లేకుండా సమ్మక్క బ్యారేజ్ ఎంతో ఉపయోగపడుతున్నదని, ఇక్కడ కావాల్సిన నీరు, మోటర్లు, పంపులు ఉన్నాయన్నారు. కానీ, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో 34 రోజులు మెగా కంపెనీకి చెందిన ఓఎన్‌ఎస్ స్టాఫ్ సమ్మె చేస్తే, సిగ్గులేని సర్కారు కనీసం రూ.6కోట్లు విడుదల చేయలేదని పట్టా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రైతాంగానికి ఎంతో ఉపయోగపడే నీటికోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఒక్కమాట మాట్లాడలేదని, చివరికి తానే సంబంధిత ఏఈ, డీఈ, ఎస్ఈ, సీఈ, ఈఎన్‌సీ, ఇరిగేషన్ సెక్రటరీతో పాటు ఇరిగేషన్ మంత్రికి దృష్టికి తీసుకుపోతే రూ.6కోట్లు విడుదల చేస్తే 34 రోజుల సమ్మెను వారు విరమించుకున్నట్లు తెలిపారు. కానీ, ఆ సమ్మెతో రైతులతో రూ.600కోట సష్టం జరిగిందన్నారు. ముఖ్యంగా జనగామ, చేర్యాల ప్రాంతాల్లో 50 శాతం పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు నష్టపోయినట్లు ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పంపులు ఆన్‌చేసి కొద్దోగొప్పో ఉన్న పంటలను కాపాడాలని ఆయన కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దుబ్బాక, మార్చి 23: డీసీఎంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారంతో సిద్దిపేట జిల్లా భూంపల్లి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు భూంపల్లి ఎస్సై హరికృష్ణ ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. భూంపల్లి చౌరస్తా వద్ద శనివారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కరీంనగర్ నుంచి డీసీఎంలో సుమారు 150 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నామని తెలిపారు. పట్టుకున్న బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. సిద్దిపేటకు చెందిన డీసీఎంతో పాటు అక్రమంగా తరలిస్తున్న నిందితులు సయ్యద్, అల్తాఫ్, సాయికుమార్, ప్రశాంత్, శశికుమార్, నరేశ్, అశోక్, సోహెల్, మోజాస్, నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

బస్టాండ్లలో సమస్యలు పరిష్కరిస్తాం

రామాయంపేట, మార్చి 23: మెదక్ జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఉదయం తన సతీమణితో కలిసి మెదక్ జిల్లా కేంద్రం నుంచి సైకిల్‌పై బయలుదేరి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామాయంపేట పట్టణానికి చేరుకున్నారు. స్థానిక బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికులతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో నిలిచి ఉన్న బస్సు ఎక్కి ప్రయాణికులతో ముచ్చటించారు. మహిళా ప్రయాణికులతో మాట్లాడి మహాలక్ష్మి పథకం అమలు గురించి ఆరా తీశారు. మహిళలు మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామాయంపేట బస్టాండ్‌ను త్వరలోనే ఆధునీకరిస్తామని తెలిపారు. సమస్యలన్నీ పరిష్కరించాలని ఆర్టీసీ డీఎం సురేఖను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తన సతీమణితో కలిసి బస్సులో టికెట్ తీసుకుని కలెక్టర్ రాహుల్‌రాజ్ మెదక్‌కు ప్రయాణించారు. కొద్దిరోజులు క్రితం కలెక్టర్ దంపతులు పొలాలను సందర్శించి మహిళా రైతులతో కలిసి వరినాట్లు వేశారు. ప్రతి ఆదివారం ఏదో ఒక కార్యక్రమాన్ని చేపడుతూ కలెక్టర్ రాహుల్‌రాజ్ అందరికీ